క్లుప్తంగా

మహిళా కో కన్వీనర్‌గా జయ



ఖానాపురం : ఉమ్మడి వరంగల్ జిల్లా ఉద్యమకారుల ఫోరం మహిళా కోకన్వీనర్‌గా కొత్తూరు గ్రామానికి చెందిన కందికట్ల జయను బుధవారం రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జయ మాట్లాడుతూ ఉద్యమకారుల సమస్యల పరిష్కారం కోసం తనవంతుగా కృషి చేస్తానన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఎంతోమంది మహిళలు పాల్గొని తమ గళం వినిపించడం జరిగిందన్నారు. తన ఎంపికకు సహకరించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

గుండెపోటుతో మహిళ మృతి



దేవమ్మ (ఫైల్)

దుగ్గొండి: డ్వాక్రా స్వయం సహాయక సంఘం సమావేశం జరుగుతుండగా ఓ మహిళ గుండెపోటుకు గురై మృతి చెందిన సంఘటన మండలంలోని మద్రిపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన దానం దేవమ్మ (58) ఇదే గ్రామంలో మంగళవారం రాత్రి స్వయం సహాయక సంఘం సమావేశానికి వెళ్లింది. మీటింగ్ జరుగుతున్న సమయంలో గుండెపోటుకు గురి కాగా సహచరులు 108 వాహనంలో ఆస్పత్రికి తరలిస్తున్న క్రమంలో మృతి చెందింది. మృతురాలికి ముగ్గురు కుమారులు రాజేందర్, రఘు, వీరేందర్, ఓ కూతురు ఉన్నారు. మృతదేహాన్ని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సందర్శించి నివాళులర్పించారు. జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ శ్రీని వాస్, నర్సింహారెడ్డి, భద్రయ్య, కమలాకర్, కుమారస్వామి,మాజీ సర్పంచ్ స్వామి, రాజు ఉన్నారు.

గీతకార్మికుడికి తీవ్ర గాయాలు

గీసుకొండ : మండలంలోని శాయంపేట హవేలిలో బుధవారం తాళ్లపెల్లి సాయిబాబా అనే గీతకార్మికుడు తాటిచెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు మోకు జారి కింద పడటంతో తీవ్రగాయాలైనట్లు స్థానికులు తెలిపారు. గాయపడిన అతడిని 108 అంబులెన్స్‌లో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించామని, పరిస్థితి విషమంగా ఉందని పేర్కొన్నారు.

శివరామక్షేత్రంలో పూజలు

ఖానాపురం : మండలంలోని ధర్మరావుపేటలోని శివరామక్షేత్రంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయోధ్య శ్రీరామ ప్రాణప్రతిష్ట వార్షికోత్సవం సందర్భంగా అభిషేకాలు, తీర్థ ప్రసాదాల వితరణ కార్యక్రమాలను చేపట్టారు. కార్యక్రమంలో యాకసాయన్న, కర్ణాకర్, వెంకన్న, సత్యం, కుమారస్వామి, వెంకటేశ్వర్లు, ఎల్లారెడ్డి, ఐలయ్య పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు యువతేజం జాతీయ పురస్కారం



రాయపర్తి: యువతేజం జాతీయ యువ ప్రతిభా పురస్కారం అవార్డుకు మండలంలోని బురహాన్‌పల్లి పంచాయతీ కార్యదర్శి, గట్టికల్‌కు చెందిన ఇల్లందుల అంబేడ్కర్‌ను ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలుగు సంస్కృతి తెలుగు వైభవం, సాహిత్యం, కళల పరిరక్షణ రంగంలో కృషి చేస్తున్న కృషిని గుర్తించి వరల్డ్ రైటర్స్ ఫోరం, వరల్డ్ పోయెట్రీ అకాడమీ అవార్డు అందించినట్లు తెలిపారు. ఈనెల 21న విజయవాడలోని శ్రీకొత పూర్ణనంద్ విలాస్ కళావేదికలో అవార్డు అందుకున్నట్లు తెలిపారు. శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కె.ప్రతాప్‌తోపాటు కవులు, రచయితలు, అధికారులు అభినందిస్తూ పురస్కారాన్ని అందించినట్లు తెలిపారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

ఖానాపురం : విద్యార్థులకు నాణ్యమైన భోజనంతో పాటు విద్యను అందించాలని ఎంఈఓ శ్రీదేవి అన్నారు. మండలంలోని అశోక్‌నగర్‌లో ప్రభుత్వ పాఠశాలలో పీఎం పోషణ్ సీఈఎస్ ఆధ్వర్యంలో పోషణ్ ఆడిట్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన అమలు తీరు, పాఠశాల రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. అలాగే విద్యార్థులకు మధ్యాహ్న భోజన అమలుపై విద్యార్థులకు పరీక్షను నిర్వహించారు. సీనియర్ పరిశోధన అధికారి మల్లారెడ్డి, ఇన్వెస్టిగేటర్ ఏసుబాబు, తిరుపతి, శృతి పాల్గొన్నారు.

ఎస్‌ఆర్‌ఆర్ ఫౌండేషన్ సేవలు ప్రశంసనీయం

రాయపర్తి: మండలంలోని నిరుపేదలకు ఎస్‌ఆర్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి అందిస్తున్న సేవలు అభినందనీయమని మాజీ జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని మైలారంలో ఇటీవల మృతిచెందిన ఎల్లమ్మ కుటుంబ సభ్యులకు 50 కేజీల బియ్యం, ఆయిల్‌క్యాన్‌ను పంపించినట్లు తెలిపారు. మైలారం ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాల క్రీడాపోటీలను ఏర్పాటు చేసి బహుమతులను అందజేయనున్నట్లు చెప్పారు.

ముగిసిన ధాన్యం కొనుగోళ్లు

- నన్నాలు అధికం..దొడ్డు అత్యల్పం
- బోనస్ కోసం రైతుల ఎదురుచూపులు



కొనుగోళ్లను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

ఖానాపురం : ధాన్యం కొనుగోళ్లు ముగిశాయి..రైతుల ఖాతాల్లో నిధుల జమ సైతం జరిగింది. ప్రభుత్వ సన్నాలు సాగు చేస్తే బోనస్ ఇస్తామనడంతో రైతులు అధిక సంఖ్యలో సాగు చేసారు. దీంతో స్థానిక సొసైటీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిన వాటి ద్వారా కొనుగోళ్లను పూర్తి చేశారు.. ధాన్యాగార కేంద్రంగా గుర్తింపు పొందింది పాకాల ఆయకట్టు..దీని కింద ఖానాపురం, నర్సంపేట, చెన్నారావుపేట మండలాల పరిధిలోని రైతులు వరి పంటలు సాగు చేసుకున్నారు. ఆయకట్టు కింద 29, 500 ఎకరాల్లో ఖరీఫ్‌లో వరి పంటలు సాగు చేశారు. కొనుగోళ్ల కోసం ఖానాపురం సొసైటీ ఆధ్వర్యంలో ఐనపల్లి, అశోక్‌నగర్, బండమీదిమామిడితండ, బుధరావుపేట, ధర్మరావుపేట, మంగళవారిపేట, మనుబోతులగడ్డ, ఖానాపురంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటి ద్వారా 1735 మంది రైతుల వద్ద 2,46,582 బస్తాల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. వీటిలో 2,34,376 సన్న రకాల బస్తాలు, 12,206 బస్తాల దొడ్డు రకపు ధాన్యాన్ని రైతుల వద్ద తీసుకున్నారు. ధాన్యానికి సంబంధించిన రూ. 27,32,20,128 లను రైతుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసింది. సన్నాలకు సంబంధించిన బోనస్ డబ్బులు రైతుల ఖాతాల్లో జమ కాకపోవడంతో రైతులు సొసైటీ కార్యాలయం వద్దకు వచ్చి అధికారులను అడిగి వెళ్తున్న పరిస్థితి నెలకొంది. వీటితో పాటు ఖానాపురం, ఐనపల్లి, రాగంపేట, రంగాపురం, ధర్మరావుపేటతో పాటు పలు గ్రామాల్లోనూ రైతు ఉత్పత్తి సంఘాల ఆధ్వర్యంలోనూ కొనుగోళ్లు చేపట్టగా వారి ఖాతాల్లోనూ ని ధుల జమ పూర్తయినట్లు సంఘాల బాధ్యులు తెలిపారు.

బోనస్ డబ్బులు పడలేదు



పొలాలను కౌలుకు తీసుకొని 44 ఎకరాలు సన్నాలనే సాగు చేశాను. ఖానాపురం సొసైటీ పరిధిలోని కొనుగోలు కేంద్రంలో విక్రయించాను. ధాన్యానికి సంబంధించిన నిధులు జమయ్యాయి. బోనస్ డబ్బులు మాత్రం జమకాలేదు. యాభై రోజులు అవుతుంది. ఇప్పటి వరకు రావడం లేదు.

– బోడ పూలునాయక్, రైతు ఖానాపురం

పూర్తయిన కొనుగోళ్లు



సొసైటీ ఆధ్వర్యంలో చేపట్టిన ధాన్యం కొనుగోళ్లు పూర్తయ్యాయి. కొనుగోళ్లకు సంబంధించిన నిధులు రైతుల ఖాతాల్లో ఇప్పటికే జమయ్యాయి. సన్నాలకు సంబంధించిన బోనస్‌లు మాత్రం కొంత మంది రైతులకు రావాల్సి ఉంది. కొనుగోళ్లకు సంబంధించిన నిధులు పూర్తిగా జమయ్యాయి.

– ఆంజనేయులు, సీఈఓ, ఖానాపురం

అక్రమ నిర్మాణాలను నిలిపివేయాలి

- లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తేజావత్ వాసునాయక్



ఆర్డీఓ కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నర్సంపేట : మండలంలోని రాజుపేట గ్రామపంచాయతీ పరిధిలోని ఏజెన్సీ చట్టాలకు విరుద్ధంగా నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలను నిలిపివేయాలని లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తేజావత్ వాసునాయక్ డిమాండ్ చేశారు. ఆర్డీఓ కార్యాలయ ఏఓకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజుపేట శివారు భూమిలో గిరిజనేతరులు ఏజెన్సీ చట్టాల నిబంధనలను తుంగలో తొక్కి అక్రమ నిర్మాణాలు, వెంచర్లు, కమర్షియల్ బిల్డింగులు, ఇటుక బట్టీలు, నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. ఏజెన్సీ చట్టంలో ఏజెన్సీ భూములపై సర్వ హక్కులు గిరిజనులకే ఉంటుందన్నారు. కానీ రాజుపేట ఏజెన్సీ గ్రామంలో ప్రభుత్వ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా ఇంటి నిర్మాణాలు, ఇటుక బట్టీలు, వెంచర్లకు పర్మిషన్లు ఇస్తున్నారని తెలిపారు. తక్షణమే గిరిజనేతరులు నిర్మాణం చేసిన కమర్షియల్ బిల్డింగ్‌లు, ఇటుక బట్టీలు, వెంచర్లను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వాంకుడోతు రాజునాయక్, ధరావత్ సుభాష్‌నాయక్ పాల్గొన్నారు.

లబ్ధిదారుల జాబితా ప్రకటించాలి

- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి



మాట్లాడుతున్న పెద్ది సుదర్శన్ రెడ్డి

నల్లబెల్లి: ప్రజాపాలన భరోసా గ్రామ సభల్లో ప్రభుత్వ పథకాల ఎంపిక కోసం ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే అర్హుల జాబితాను కాదు.. లబ్ధిదారుల జాబితాను ప్రకటించాలని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని తన నివాసంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మొదటి రోజు నియోజకవర్గంలో 34 రెవెన్యూ గ్రామాల్లో ప్రజాపాలన భరోసా గ్రామ సభలు నిర్వహించగా.. 23 చోట్ల ప్రజలు తీవ్రమైన నిరసన వ్యక్తం చేయడం స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమన్నారు. నల్లబెల్లిలో విధ్వంసం సృష్టించేందుకు మాధవరెడ్డి పోలీసు వ్యవస్థను అడ్డుపెట్టుకొని కాంగ్రెస్ నాయకులను రెచ్చగొడుతున్నాడని ఆరోపించారు. గ్రామ సభలో సమస్యలపై ప్రశ్నిస్తే ప్రజలపై విరుచుకుపడడం సరికాదన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బానోత్ సారంగపాణి, పీఏసీఎస్ చైర్మన్ చెట్టుపల్లి మురళీధర్, మండల ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి కోటిలింగాచారి, ప్రవీణ్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, రాజారాం, మోహన్ రెడ్డి, శ్రీనివాస్, శివాజీ పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

వర్ధన్నపేట/రాయపర్తి/నర్సంపేట రూరల్ : వర్ధన్నపేట మండలం ఇల్లంద జెడ్పీహెచ్‌ఎస్‌లో, రాయపర్తి మండలం కొండూరులో, నర్సంపేట మండలంలోని గురిజాల గ్రామంలో బుధవారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు డీఈఓగా, ఎంఈవోగా, హెచ్‌ఎంగా, ఉపాధ్యాయులుగా విధులు నిర్వర్తించారు. ఉపాధ్యాయులుగా విధులు నిర్వర్తించిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.



వర్ధన్నపేట : ఉపాధ్యాయులతో విద్యార్థినీ, విద్యార్థులు



రాయపర్తిలో..



నర్సంపేట రూరల్: సమావేశంలో మాట్లాడుతున్న హెచ్‌ఎం అర్పిత

అభివృద్ధి పనులు చేపడతాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

నర్సంపేట : పట్టణంలోని అన్ని వార్డుల్లో త్వరలోనే అభివృద్ధి పనులు చేపడతామని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తెలిపారు. పట్టణంలోని మునిసిపల్ కార్యాలయంలో బుధవారం మునిసిపల్ చైర్‌పర్సన్ గుంటి రజని అధ్యక్షతన సాధారణ సమావేశం నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఆరు గ్యారంటీ పథకాలపై గతంలో దరఖాస్తు చేసుకోని వారు వార్డు సభలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంవీఐ శోభన్‌బాబు

నర్సంపేట: ఆర్టీసీ డ్రైవర్లు డ్రైవింగ్ చేసే సమయంలో రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తూ జాగ్రత్తగా ఉండాలని వరంగల్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ ఆర్.శోభన్‌బాబు సూచించారు. నర్సంపేట ఆర్టీసీ డిపోలో బుధవారం డిపో మేనేజర్ ప్రసూనలక్ష్మి ఆధ్వర్యంలో జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శోభన్‌బాబు మాట్లాడుతూ ఉద్యోగులు ఇంటికి వెళ్లేటప్పుడు, డ్యూటీకి వచ్చే ముందు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. అనంతరం ఉత్తమ డ్రైవర్‌లకు ప్రశంసపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ భవాని, అసిస్టెంట్ ఇంజనీర్ ప్రభాకర్, సూపర్‌వైజర్లు డీఎస్ నారాయణ, ఏడీసీలు, సెక్యూరిటీ హెడ్ వీరారెడ్డి, ఎస్‌డీఐ వెంకటేశ్వర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

తండ్రి తద్దినం రోజే కుమారుడి మృతి

- తలకొరివి పెట్టిన తల్లి



కిరణ్‌కుమార్ గౌడ్(ఫైల్)

నల్లబెల్లి: పిల్లలు చిన్నప్పుడే భర్త అనారోగ్యంతో మృతి చెందాడు. తండ్రి లేని లోటు తెలియకుండా తనకున్న ఇద్దరు కుమారులను అల్లారుముద్దుగా పెంచి పెద్దజేసింది. వృద్ధాప్యంలో చిన్న కుమారుడు తలకొరివిపెడుతాడని ఆశ పడింది. కానీ భర్త తద్దినం కార్యక్రమం పూర్తి చేసిన కొద్ది చేపటికే చిన్న కుమారుడు మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మేడిపల్లి జంపయ్య–భాగ్యలక్ష్మి దంపతులకు ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడు కిరణ్ కుమార్ గౌడ్(32) గీత కార్మికుడు, హమాలీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. తండ్రి 20 ఏళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. కిరణ్ కుమార్ గౌడ్ నాలుగు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. బుధవారం ఉదయం తన తండ్రి తద్దినం కార్యక్రమాన్ని కుటుంబ సభ్యులతో కలిసి పూర్తి చేసిన కొద్ది చేపటికే తీవ్రమైన ఛాతి నొప్పితో ఇంట్లో కుప్పకూలిపోయాడు. ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. తల్లి అంత్యక్రియలు నిర్వహించి తలకొరివి పెట్టడంతో పలువురిని కంటతడి పెట్టించింది. మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10 వేల ఆర్థిక సాయాన్ని అందించారు. భారతీయ జనతా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గొగుల రాణాప్రతాప్ రెడ్డి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

సంక్షిప్త సమాచారం

క్యాట్ ఫలితాల్లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ

నర్సంపేట : జాతీయ స్థాయిలో గత డిసెంబర్ 8న నిర్వహించిన క్యాట్ (నాలెడ్జ్ అసెస్మెంట్ టెస్ట్)లో పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాల నుంచి 34 మంది విద్యార్థులు పాల్గొని జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. బుధవారం పాఠశాలలో క్యాష్ ప్రైజ్ పొందిన విద్యార్థులు రిషి, విహాస్‌చంద్ర, సమీక్ష, బుష్రాతెహసీన్, ప్రసస్తిలకు మెరిట్ సర్టిఫికెట్లు, మెడల్, క్యాష్ ప్రైజ్ అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నవీన్‌రావు మాట్లాడారు.

క్రీడా విద్యార్థినికి సన్మానం

వర్ధన్నపేట : మండలంలోని ఇల్లందకు చెందిన జాతీయ, రాష్ట్రస్థాయి క్రీడల్లో రాణిస్తున్న జోగుల దీపికను ఆమెను ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులను బుధవారం గ్రామంలో జనజాగృతి వేదిక ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. జఫరగడ్‌లోని సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌లో ఇంటర్మీడియట్ ఫస్టియర్ చదువుతున్న దీపిక ఇటీవల ఒడిశాలో నిర్వహించిన జాతీయ స్థాయి షూటింగ్‌బాల్ క్రీడలో రాష్ట్రం తరఫున పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచింది. అదే విధంగా కేసముద్రంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొని జట్టును ద్వితీయ స్థానంలో నిలిపింది. భవిష్యత్‌లో క్రీడల్లో రాణించేందుకు అన్ని విధాలుగా సహకరిస్తామని సభ్యులు తెలిపారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటుతాం

రాయపర్తి: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తాచాటుతామని బీజేపీ రాష్ట్ర నాయకుడు కర్ర శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలకేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జనవరి 26న ప్రతీ బూత్‌లో యావత్ తెలంగాణ వ్యాప్తంగా జాతీయజెండా ఎగురవేయాలని రాష్ట్రపార్టీ నిర్ణయించిందన్నారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం తప్పదన్నారు.

కొరత లేకుండా యూరియా సరఫరా చేయాలి

సంగెం : మండలంలో మొక్కజొన్న, వరి తదితర పంటలకు ప్రస్తుతం యూరియా అవసరం చాలా ఉందని కొరత లేకుండా సరఫరా చేయాలని అఖిల భారత కిసాన్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు ఎండీ.ఇస్మాయిల్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో ఏఐకేఎఫ్ మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు.

డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన అవసరం

నర్సంపేట : నేటి యువత ప్రజలకు డ్రగ్స్, మత్తు పదార్థాల నిర్మూలనపై అవగాహన అవసరం అని ప్రముఖ వైద్యుడు డాక్టర్ గోపాల్ అన్నారు. పట్టణంలో మాతృక మూవీస్ క్రియేషన్స్‌పై నిర్మిస్తున్న 'జీవా మత్తు వదలరా భవిత నీదేరా' అనే షార్ట్ ఫిలిం ఫస్ట్ లుక్ పోస్టర్‌ను బుధవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి సందేశాత్మక చిత్రాలను ప్రజలు ఆదరించాలని కోరారు. డైరెక్టర్ లారా మాట్లాడుతూ మాతృక టీవీని ఆదరించిన ప్రజలు సామాజిక బాధ్యతగా ఈ షార్ట్ ఫిలిం తీస్తున్నామన్నారు.

ఈర్యతండాలో అక్షరాభ్యాసం

చెన్నారావుపేట : మండల కేంద్రంలోని ఈర్య తండా అంగన్‌వాడీ సెంటర్‌లో బుధవారం చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు.

మొక్క నాటించిన వన ప్రేమికుడు

చెన్నారావుపేట : తహసీల్దార్ ఫణికుమార్ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని నెక్కొండ మండలం గుండ్రపల్లికి చెందిన గ్రీన్ ఇండియా చాలెంజ్ అవార్డు గ్రహీత, వన ప్రేమికుడు నల్లగొండ సమ్మయ్య నేరేడు పండ్ల మొక్క నాటించాడు. తహసీల్దార్ మాట్లాడుతూ వన ప్రేమికుడు సమ్మయ్య మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షిస్తు జిల్లా వ్యాప్తంగా ఆదర్శంగా నిలిస్తున్నాడని అభినందించారు.

సివిల్ సప్లయీస్ హమాలీల సంబురాలు

వర్ధన్నపేట : రాష్ట్ర ప్రభుత్వం సివిల్ సప్లయీ హమాలీల కూలీ రేట్ల జీఓను అమలుపరచడంతో బుధవారం వర్ధన్నపేట ఎంఎల్‌ఎస్ పాయింట్ వద్ద హమాలీలు స్వీట్లు పంపిణీ చేసుకుని సంబురాలు జరుపుకున్నారు. అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

సాక్షి, నెట్‌వర్క్ : ఖానాపురం, గీసుకొండ, సంగెం, పర్వతగిరి మండలంలోని గ్రామాల్లో వివిధ కారణాలతో మృతి చెందిన బాధిత కుటుంబాలను నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, పరకాల మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి, పలువురు ప్రముఖులు పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. మృతదేహాలపై పూలమాల వేసి నివాళులర్పించా రు. వారి వెంట ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు

రైతుల సమస్యలు వారి అవసరాలపై చర్చించి వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు ప్రభుత్వం తీసుకుంటుందని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కొలన్‌పల్లిలో నిర్వహించిన గ్రామసభలో ఆమె పాల్గొని మాట్లాడుతూ ఎవరే పార్టీ అన్నది కాదు అర్హులైన ప్రతీ పేద కుటుంబానికి ప్రభుత్వ పథకాలు అందిస్తామని ఆమె తెలిపారు. నర్సంపేట, చెన్నారావుపేట, సంగెం, దుగ్గొండి, ఖానాపురం, పర్వ తగిరి, గీసుకొండ, నెక్కొండ మండలాల్లోని ఆయా గ్రామాల్లో గ్రామ సభలు జరిగాయి. సంగెంలో పాల్గొన్న డీఆర్‌ఓ మాట్లాడుతూ లబ్ధిదారుల జాబితాల్లో పేర్లు రాని అర్హులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. జాబితాలో ఉన్న అనర్హులుంటే తెలియజేయాలన్నారు. కొన్ని మండలాల్లో గ్రామసభలో అధికారులను ప్రజలు నిలదీశారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల్లో అర్హత కలిగి ఉన్నవారికి న్యాయం జరిగేలా చూస్తామని ఎవరూ ఆందోళన చెందవద్దని డీఆర్‌డీఓ కౌసల్యాదేవి అన్నారు. గత ప్రభుత్వంలో కొంత మందికి ఇళ్లు మంజూరైనట్లు తెలియగానే వారు నిర్మాణ పనులు ప్రారంభించారని అట్టి వారికి ఈ పథకాలలో లబ్ధిదారులుగా చేర్చడం కుదరదన్నారు. అయితే గ్రామాల వారిగా వారి జాబితాలను తయారు చేసి జిల్లా ఉన్నతాధికారులకు పంపుతామన్నారు. దుగ్గొండిలో జరిగిన గ్రామ సభల్లో జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, జిల్లా ఉద్యానశాఖ అధికారి సంగీతలక్ష్మీ, తహసీల్దార్ రవిచంద్రారెడ్డి, ఎంపీడీఓ అరుందతి, ఎంపీఓ శ్రీధర్‌గౌడ్ పాల్గొన్నారు. ఖానాపురంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది.

– సాక్షి, నెట్‌వర్క్



రాయపర్తి: కొలన్‌పల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



సంగెం : మాట్లాడుతున్న డీఆర్‌ఓ విజయలక్ష్మి



దుగ్గొండి: ముద్దునూరు గ్రామ సభలో అధికారులను ప్రశ్నిస్తున్న ఎండీ.మున్నీ



ఖానాపురం : మనుబోతులగడ్డలో అధికారులను నిలదీస్తున్న ప్రజలు



నెక్కొండ: అధికారులతో వాగ్వాదానికి దిగుతున్న గ్రామస్తులు



పర్వతగిరి: మాట్లాడుతున్న అనిల్‌రావు



నర్సంపేట : దరఖాస్తును అందజేస్తున్న లబ్ధిదారులు



చెన్నారావుపేట: మాట్లాడుతున్న స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ బాలకృష్ణ

'పది'లో ఉత్తమ ప్రతిభ చూపాలి

చెన్నారావుపేట: విద్యార్థులు వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని వరంగల్ రోటరీ క్లబ్ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, ఉపాధ్యక్షులు అనంతుల కుమారస్వామి అన్నారు. మండలంలోని ఉప్పరపల్లి హైస్కూల్‌లోని పదో తరగతి విద్యార్థులకు బుధవారం స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 38 మంది విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ స్టడీ మెటీరియల్ అందించామన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మరిన్ని సేవలు అందిస్తామని పేర్కొన్నారు. పాఠశాల హెచ్‌ఎం జయ మాట్లాడుతూ స్టడీ మెటీరియల్ అందించడం సంతోషమని వారికి కృతజ్ఞతలు తెలిపారు. గత ఏడాది 25 సైకిళ్లను, ఒక ల్యాప్‌టాప్, స్టడీ మెటీరియల్‌ను అందించారన్నారు. అలాగే ప్రాథమిక పాఠశాలకు రూ. 8000 విలువ చేసే టేబుళ్లను అందించారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పిన్నింటి బాలాజీరావు, శ్రీనివాస్, రమేష్, వేద ప్రకాష్, ఓం ప్రకాష్, సంధ్య, కొంరయ్య, తదితరులు పాల్గొన్నారు.

పల్లె దవాఖానాలో తీరిన నీటి సమస్య

సాక్షి ఎఫెక్ట్..



నీటి కనెక్షన్ పనులు చేయిస్తున్న అధికారులు

చెన్నారావుపేట : మండలంలోని పాపయ్యపేటలోని పల్లె దవాఖానలో నీటి సమస్య తీరింది. దవాఖానాలో నీటి సరఫరాకు అవసరమైన అన్ని వసతులు ఉన్నా కనెక్షన్ ఇవ్వకపోవడంతో మరుగుదొడ్లు, మూత్రశాలలు నిరుపయోగంగా ఉండడంతో మహిళా ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై బుధవారం 'పల్లె దవాఖానలో నీటి గోస' అనే కథనం సాక్షిలో ప్రచురించింది. స్పందించిన మిషన్ భగీరథ ఏఈ రణధీర్, పంచాయతీ కార్యదర్శి రాజు స్పందించారు. వెంటనే నీటి కనెక్షన్ ఇచ్చి నీటిసౌకర్యం కల్పించారు.